క్లుప్తంగా

1న క్యాంపస్ ఇంటర్వ్యూలు

కొత్తవలస: డెక్కన్ ఫైన్ కెమికల్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో ఉద్యోగాలకు స్థానిక వాగ్దేవి డిగ్రీ, పీజీ కళాశాల ఆవరణలో జూన్-1వ తేదీన క్యాంపస్ ఇంటర్వ్యూ లు (ప్రాంగణ ఎంపికలు) నిర్వహించనున్నట్లు కళాశాల కరస్పాండెంట్ మహేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2017-2023 మధ్య బీఎస్సీ, ఎంఎస్సీ కెమిస్ట్రీ పూర్తి చేసిన వారు అర్హులని పేర్కొన్నారు. వివరాలకు 95501 31930, 90145 76033 నంబర్లకు ఫోన్‌లో సంప్రదించాలని సూచించారు.

ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్టోత్సవం



ఆంజనేయస్వామికి పూజలు చేస్తున్న భక్తులు

బొండపల్లి: బోడసింగిపేట గ్రామంలోని మున్సిఫ్ కోర్టు సమీపంలో ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్టోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. విగ్రహ ధర్మకర్తలు బోడసింగి జగదీశ్వరరావు, మాధవి దంపతుల తొలి పూజతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. అనంతరం గ్రామస్తులు స్వామి వారికి పూజలు చేశారు.

పోలీస్ స్టేషన్‌లో తనిఖీలు



సీఐ బాలసూర్యారావుతో మాట్లాడుతున్న డీఎస్పీ గోవిందరావు

కొత్తవలస: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విజయగనరం డీఎస్పీ ఆర్.గోవిందరావు సోమవారం తనిఖీలు నిర్వహించారు. రికార్డులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట సీఐ ఎస్.బాలసూర్యారావు తదితరులు ఉన్నారు.

31న ఇసుక వేలం

చీపురుపల్లి: అక్రమ రవాణా కేసులో సీజ్ చేసిన ఇసుకను జూనియర్ సివిల్ జడ్జి ఆదేశాల మేరకు ఈ నెల 31న తహసీల్దార్ సమక్షంలో బహిరంగ వేలం వేయనున్నట్లు ఎస్‌ఐ ఏ.సన్యాసినాయుడు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023 మే 19న గొల్లలపాలెం గ్రామ పరిధిలో రెండు అక్రమ ఇసుక డంప్‌లను గుర్తించి కేసు నమోదు చేసి, ఇసుకను సీజ్ చేశామని పేర్కొన్నారు. 31వ తేదీ ఉదయం 11 గంటలకు గొల్లలపాలెంలో వేలం వేయనున్నామని, ఆసక్తి ఉన్న వారు పాల్గొన వచ్చని సూచించారు.

పీడీఎస్ బియ్యం వేలం

గజపతినగరం: పలు అక్రమ రవాణా కేసుల్లో పోలీసులు సీజ్ చేసిన 229.40 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యానికి గజపతినగరం ఎంఎల్‌ఎస్ పాయింట్ వద్ద ఈనెల 31న వేలం వేయనున్నట్లు సీఎస్‌డీటీ రవిశంకర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. బుధవారం మధ్యాహ్నం ప్రారంభం కానున్న వేలం పాటలో ఆసక్తి గల వారు పాల్గొనవచ్చని సూచించారు.

వైభవంగా ఆలయ ప్రతిష్ట



ముర్రాటలతో ఊరేగింపుగా ఆలయానికి వెళుతున్న మహిళలు

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి మండలం వెదుళ్లవలస గ్రామంలో దశావతార సహిత రాధాకృష్ణుల దేవాలయ ప్రతిష్ట మహోత్సవం వేదపండితులు,గ్రామపెద్దల ఆధ్వర్యంలో సోమవారం వైభవంగా నిర్వహించారు. గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. జలాదివాసం కార్యక్రమానికి మహిళలు ముర్రాటలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు.సాంస్కృతిక కార్యక్రమాలతో గ్రామంలో సందడి నెలకొంది.

రిలే నిరాహార దీక్షలు

చీపురుపల్లి: ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం(ఏపీజీఈఏ) ఆధ్వర్యంలో స్థా నిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమ వారం ఒక్కరోజు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. పలు వురు ఉద్యోగ సంఘ నాయకులు మాట్లాడుతూ సీ పీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలన్నా రు. 1993 నవంబర్ 25కి ముందు విధుల్లో చేరిన ఎన్ఎంఆర్, డైలీవేజెస్, కంటిజెంట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలన్నారు. అన్నిశాఖల్లో జిల్లా సెలక్షన్ కమిటీల ద్వారా నియమితులైన కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేసి, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం కల్పించాలని కోరారు. 11వ పీఆర్సీలో ఒప్పందం ప్రకారం ఆర్థిక బకాయిలు చెల్లించాలని కోరారు. జిల్లా జాయింట్ సెక్రటరి జి.లక్ష్మునాయుడు, కార్యదర్శి కంది వెంకటరమణ, తాలూకా సంఘం అధ్యక్షుడు కర్రోతు విశ్వేశ్వరరావు, కోశాధికారి ప్రసాద్, ఉపాధ్యక్షులు ఎస్.బట్లు, కంది నాగేశ్వరరావు, సంయుక్త కార్యదర్శులు హైమావతి, రవికుమార్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో ప్రతి కుటుంబానికి లబ్ధి

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే అప్పలనరసయ్య, ఎమ్మెల్సీ రఘురాజు, ఎమ్మెల్యే కడుబండి



కొత్తవలస: సీఎం జగన్ సందేశ పత్రాన్ని మహిళకు అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు



గంట్యాడ: మహిళకు పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే అప్పలనరసయ్య, ఎమ్మెల్సీ రఘురాజు

గంట్యాడ: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో రాష్ట్రంలో ప్రతీ కుటుంబం లబ్ధి పొందుతోందని గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు అన్నారు. మండలంలోని గొడియాడ గ్రామంలో సోమవారం 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ప్రజాప్రతి నిధులు, అధికారులతో కలిసి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ఇంటింటికీ వెళ్లి పథకాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గత నాలుగేళ్లుగా రాష్ట్రంలో సంక్షేమపాలన సాగుతోందని అన్నారు. జగన్‌మోహన్ రెడ్డి పాలనలో వర్షాలు విస్తారంగా పడుతున్నాయ ని, రైతులు సంతోషంగా వ్యవసాయం చేసుకుంటున్నారన్నారు. ప్రజలను మరోసారి మోసం చేయడానికి అన్ని ఫ్రీ అని ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు చెబుతున్నారని, అటువంటి మోసపూరిత మాటలు నమ్మవద్దని హితవు పలికారు.

'గడప గడపకు మన ప్రభుత్వం'లో టీడీపీ సర్పంచ్, ఎంపీటీసీ

గొడియాడలో నిర్వహించిన 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో టీడీపీకి చెందిన గ్రామ సర్పంచ్ కుబిరెడ్డి వెంకటేష్, ఎంపీటీసీ వర్రి సన్యాసిరావు పాల్గొన్నారు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు పుష్ప గుచ్ఛాలు ఇచ్చి స్వాగతం పలికారు. జెడ్పీటీసీ వర్రి నరసింహమూర్తి, ఏఎంసీ చైర్మన్ వేమలి ముత్యాలనాయుడు, వైఎస్సార్ సీపీ నాయకులు ఇందుకూరి సీతారామరాజు (పెదబాబు) బొబ్బిలి అప్పలనాయుడు, లచ్చిరెడ్డి కృష్ణ పాల్గొన్నారు.

ప్రజల సంతోషమే ముఖ్యం

కొత్తవలస: ప్రజల సంతోషమే తమకు ముఖ్యమని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. కొత్తవలస మేజర్ పంచాయతీ పరిధి కుమ్మరిబంజిరి కాలనీలో సోమవా రం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే గడప గడపకూ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించి, సమస్యలపై ఆరా తీశారు. గ్రామస్తులు తెలిపిన సమస్యలను పరిష్కరించాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. పీఏసీఎస్ చైర్మన్ గొరపల్లి శివ, సర్పంచ్ మచ్చ రామస్వామి,కొత్తవలస మార్కెటింగ్ కమిటీ వైస్ చైర్మన్ బొంతల వెంకటరావు, నాయకులు చెల్లయ్య,మాధవరావు,పలువురు వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

నేటి నుంచి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

జామి: మండలంలోని భీమసింగి సుగర్ ఫ్యాక్టరీ వద్ద ఉన్న కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో అయిదురోజుల పాటు నిర్వహించనున్న బ్రహ్మోత్సవాలు మంగళవారం ప్రారంభం కానున్నాయి. పాలకమండలి సభ్యులు ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేశారు.మంగళవారం స్వామి వారికి పంచామృతాభిషేకాలు, అంకురార్పణ, 31న స్వామివారి కల్యాణం, జూన్ 1న శ్రీవారి గరుడసేవ, 2న స్వామివారి తులాభారసేవ, 3న దొంగల దోపిడి ఉత్సవం,4న వసంతోత్సవం కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ పాలకమండలి సభ్యులు సోమవారం తెలిపారు.

నేడు సూర్యనారాయణస్వామి కల్యాణం

మెరకముడిదాం: మండలంలోని సోమలింగాపురం గ్రామంలో సూర్యనారాయణమూర్తి, ఉమా సోమలింగేశ్వరస్వామి వార్ల ఆలయంలో సూర్యనారాయణ స్వామి కల్యాణం మంగళవారం నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకుడు ఆరవెల్లికృష్ణశాస్త్రి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. కళ్యాణ మహోత్సవాన్ని ఆలయ అనువంశిక ధర్మకర్త, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఎస్.వి.రమణరాజు ఆధ్వర్యంలో ఉదయం స్వామివార్లకు ప్రత్యేక పూజలు, సాయంత్రం కల్యాణం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

రెండు రోజుల పాటు శివాలయ వార్షికోత్సవం

వేపాడ: మండలంలోని బానాది శివాలయం వార్షికోత్సవం మంగళవారం, బుధవారం రెండు రోజుల పాటు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు, మేడపాటి కిశోర్ శర్మ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మంగళవారం రాత్రి పార్వతీపరమేశ్వర్ల కల్యాణం, బుధవారం ఉదయం ప్రత్యేక పూజలు, అభిషేకాలు, మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకూడదు

దత్తిరాజేరు: మండలంలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా పంచాయతీ కార్యదర్శులు తగిన చర్యలు తీసుకోవా లని ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా మండల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రతి ఒక్కరూ దృష్టిసారించాలని అన్నారు.సచివాలయాల స్థాయిలో సమస్యలపై అందిన ఫిర్యాదులను పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది కలిసి పరిష్కరించాలని సూచించారు. రెవెన్యూ సమస్యలపై తహసీల్దార్ ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు.

సమస్యలకు త్వరితగతిన పరిష్కారం చూపాలి



బొండపల్లి: అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ చలంనాయిడు

బొండపల్లి: 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక టోల్‌ఫ్రీ నంబర్‌కు ప్రజలు తెలియజేసిన, కార్యాలయాలకు అందిన వినతిపత్రాలను పరిశీలించి, ప్రజాసమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఎంపీపీ చల్లా చలంనాయుడు ఆదేశించా రు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. అధి కారులతో కలిసి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వివిధ సమస్యలపై 11 వినతిపత్రాలు అందాయి. ఈ సందర్భంగా అధికారు లతో ఎంపీపీ మాట్లాడుతూ స్పందనలో వచ్చిన అర్జీలను సకాలంలో పరిష్కరించాలని సూచించారు. తహసీల్దార్ శ్రీనివాస్ మిశ్రా, ఎంపీడీఓ ఏ.వేదవతి, ఈఓపీఆర్డీ సుగుణాకరరావు తదితరులు పాల్గొన్నారు.

స్పందనను సద్వినియోగం చేసుకోండి

గజపతినగరం: ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక 'స్పందన' కార్యక్రమాన్ని ప్రజలంతా సద్విని యోగించు కోవాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ పప్పు సుదర్శనం సూచించారు.స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్ర మం నిర్వహించి, ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. గ్రామాల్లో ప్రజలకు 'స్పందన' కార్యక్రమంపై పంచాయతీ కార్యదర్శులు అవగాహన కల్పించాలని సూచించారు. తహసీల్దార్ ఎం.అరుణకుమారి, ఈఓపీఆర్డీ డి.జనార్దనరావు తదితరులు పాల్గొన్నారు.



గజపతినగరం: మాట్లాడుతున్న ఎంపీడీఓ సుదర్శనం



చీపురుపల్లి: మాట్లాడుతున్న ఎంపీడీఓ రామకృష్ణరాజు

'జగనన్నకు చెబుదాం' సద్వినియోగం కావాలి

చీపురుపల్లి: ప్రజల ప్రతి సమస్యనూ పరిష్కరించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చిన 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమం సద్వినియోగమయ్యేలా చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ కె.రామకృష్ణరాజు అధికారులకు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం స్పందనతో పాటు మండల, పంచాయతీ స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమంపై ప్రతీ గ్రామంలో అవగాహన కల్పించాలని, సంబంధిత టోల్ ఫ్రీ నంబర్ కూడా ప్రజలకు తెలియజేయాలని సూచించారు. నాడు-నేడు పథకంలో భాగంగా పాఠశాలల్లో అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. రైతు భరోసా కేంద్రాలు, వెల్‌నెస్ కేంద్రాల భవన నిర్మాణాలను వేగవంతం చేయాలన్నారు. ఈఓపీఆర్డీ అన్నపూర్ణదేవి, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

వలంటీర్లకు సన్మానం



శృంగవరపుకోట: వెంకటరమణపేటలో వలంటీర్లను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ రఘురాజు



లక్కవరపుకోట: తామరాపల్లిలో వలంటీర్లను సన్మానిస్తున్న ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు



వేపాడ: వావిలపాడులో వలంటీర్లకు పురస్కారాలు అందించిన ఎంపీపీ సత్యవంతుడు



కొత్తవలస: నిమ్మలపాలెంలో వలంటీర్లను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ రఘురాజు, ప్రజా ప్రతినిధులు

'వలంటీర్లకు వందనం' కార్యక్రమంలో భాగంగా కొద్దిరోజులుగా నిర్వహిస్తున్న గ్రామ వలంటీర్ల సన్మాన కార్యక్రమాలు శృంగవరపుకోట, చీపురుపల్లి, గజపతినగరం నియోజకవర్గాల్లో సోమవారం కొనసాగాయి. కొత్తవలస మండలంలోని నిమ్మలపాలెం గ్రామంలో అప్పన్నపాలెం, చిన్నిపాలెం,ఉత్తరాపల్లి,నిమ్మలపాలెం గ్రామ సచివాలయాల పరిధి వలంటీర్లను, ఎస్.కోట మండలంలోని వెంకటరమణపేట, కొట్టాం, వీరనారాయణం గ్రామాల వలంటీర్లను ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు సన్మానించారు.

– సాక్షి నెట్‌వర్క్



బొండపల్లి: సేవారత్న అవార్డు సాధించిన వలంటీరును సన్మానిస్తున్న ఎంపీపీ చలం

ఆక్రమణలను నిలువరించండి

గజపతినగరం: స్థానిక చంపావతి నది 13వ వంతు చానెల్ (కాలువ) ఆక్రమణదారులపై అధికారులు చర్యలు తీసుకోవాలని మండలంలోని పిడిశీల, సీతారామపురం, కాలంరాజుపేట గ్రామస్తులు డిమాండ్ చేశారు. 13వ వంతు చానెల్ వద్ద ఆయా గ్రామాల రైతులు సోమవారం ఆందోళనకు దిగారు. పిడిశీల గ్రామపెద్ద పాంచ్రంకి సూర్యప్రప్రకాష్ మాట్లాడుతూ 13వ వంతు చానెల్ కాలువ ఆధారంగా ఏడు గ్రామాల రైతులు పంటలు సాగు చేసుకుంటున్నారన్నారు. అయితే ఈ కాలువను గజపతినగరం సూర్య థియేటర్ వద్ద ఉన్న అయోధ్యరాజు మట్టిని వేసి కప్పేస్తున్నారని ఆరోపించారు. ఆక్రమణలు తొలగించాలని అధికారులను కోరారు. సమస్య పరిష్కరించకుంటే రైతులందరితో కలిసి రాస్తారోకో చేయక తప్పదని హెచ్చరించారు.

ప్రత్యామ్నాయం చూడండి

లక్కవరపుకోట: అరకు-విశాఖ రోడ్డు విస్తరణ వల్ల భూములు కోల్పోతామని, తమ జీవనోపాధి ప్రశ్నార్థకంగా మారిపోతుందని కొత్తగంగుబూడి గ్రామానికి చెందిన పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యపై తహసీల్దార్ టి.రామకృష్ణకు సోమవారం వారు వినతిపత్రం అందజేశారు. రైతులు మాట్లాడుతూ తామంతా వ్యవసాయం, పాడి పరిశ్రమపై ఆధారపడి బతుకుతున్నామని, రోడ్డు విస్తరణలో ఎక్కువగా తమ గ్రామస్తుల భూములే పోతున్నాయని అన్నారు. అధికారులు తమ సమస్యను అర్థం చేసుకుని, రోడ్డు విస్తరణకు ప్రత్యామ్నాయం చూడాలని కోరారు. గ్రామ పెద్దలు గొలగాని సత్యనారయణ తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటిక ఆక్రమణపై ఫిర్యాదు

మెరకముడిదాం: ఉత్తరావల్లిలో ఎస్సీలకు చెందిన శ్మశాన వాటిక ఆక్రమణలపై కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందనలో ఫిర్యాదు చేశామని ఆ గ్రామ ఎస్సీలు సోమవారం విలేకరులకు తెలిపారు. గ్రామానికి చెందిన కొందరు శ్మశానవాటికను ఆక్రమించి, పొలాలకు రోడ్డు వేసుకుంటున్నారని ఆరోపించారు. తమ ఫిర్యాదుకు కలెక్టర్ స్పందించారని, ,వెంటనే ఆర్డీఓ, తహసీల్దార్‌కు ఫోన్‌చేసి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారని ఫిర్యాదుదారులు తెలిపారు.

అధికారం కోసం అడ్డదారులు

- మరోసారి ప్రజలను మోసం చేసేందుకు చంద్రబాబు ఆల్ ఫ్రీ మేనిఫెస్టో
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



నిరసన ప్రదర్శనలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

చీపురుపల్లి: ఎన్నికలకు కొద్ది కాలం మాత్రమే ఉండడంతో అధికార దాహంతో చంద్రబాబునాయుడు అన్నీ ఫ్రీగా ఇచ్చేస్తానంటూ తాను ఆల్ ఫ్రీ బాబునే అంటూ ప్రజలను మరోసారి మోసం చేసేందుకు బయలుదేరాడని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు విమర్శించారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పేద ప్రజలకు ఇచ్చే ఇంటి స్థలాలు శవాన్ని పూడ్చడానికి సరిపోతుందని చంద్రబాబునాయుడు కించపరిచే వ్యాఖ్యలను నిరసిస్తూ వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో సోమవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. చీపురుపల్లి, గరివిడి, మెరకముడిదాం, గుర్ల మండలాలకు చెందిన పార్టీ శ్రేణులు, ఇళ్ల లబ్ధిదారులు కలిసి నిర్వహించిన ర్యాలీని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 2014 నుంచి 2019 వరకు ప్రజలు చంద్రబాబుకు అధికారం ఇస్తే 2014లో ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ప్రజలను మోసం చేసిన సంగతి ప్రజలకు గుర్తుందన్నారు. చంద్రబాబు అధికారంలో ఉన్నంత కాలం పెత్తందారుల కోసమే పని చేశారన్నారు. ఎన్నికల ముందు హామీలు ఇవ్వడం అధికారంలోకి వచ్చాక పేదలను మరిచిపోవడం చంద్రబాబుకు అలవాటేనన్నారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా 32 లక్షల మంది పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇళ్ల కట్టించి ఇచ్చారని, తాజాగా అమరావతిలో ఒకేరోజు 52 వేల మంది పేదలకు ఇళ్ల స్థల పట్టాలు పంపిణీ చేశారని చెప్పారు. చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న మూడు సార్లు ఎప్పుడైనా ఇంత పెద్దస్థాయిలో సంక్షేమ పథకాలు అమలు చేశారా అని ప్రశ్నించారు. జిల్లా కేంద్రంలోని గుంకలాంలో అతి పెద్ద లేఅవుట్ ఏర్పాటు చేసి సుమారు 15 వేల మంది పేదలకు ఇళ్ల స్థలాలు, ఇళ్లు మంజూరు చేసిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో పలాస నియోజకవర్గ పరిశీలకుడు కె.వి.సూర్యనారాయణరాజు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఎస్.వి.రమణరాజు, ఏఎంసీ చైర్మన్ దన్నాన జనార్దనరావు, గుర్ల, గరివిడి జెడ్పీటీసీలు శీర అప్పలనాయుడు, వాకాడ శ్రీనివాసరావు, జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ బెల్లాన బంగారునాయుడు, చీపురుపల్లి మండల నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, బెల్లాన వంశీకృష్ణ, కరిమజ్జి శ్రీనివాసరావు, పతివాడ రాజారావు, గరివిడి మండల నాయకులు మీసాల విశ్వేశ్వరరావు, బమ్మిడి అప్పలస్వామి, మెరకముడిదాం మండల నాయకులు తాడ్డి వేణు, కోట్ల వెంకటరావు, బూర్లె నరేష్, గుర్ల మండల నాయకులు పొట్నూరు సన్యాసప్పలనాయుడు, తోట తిరుపతి రావు, అంబల్ల చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు వన్‌బీల అందజేత

బొండపల్లి: నెలివాడ గ్రామంలో కూరాకుల కూలానికి చెందిన సుమారు 100 కుటుంబాల వారు తరతరాలుగా సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య దృష్టికి సర్పంచ్ తాళ్లపూడి కీర్తి, వైఎస్సార్‌సీపీ నాయకులు తాళ్లపూడి అప్పలనాయుడు తీసుకువెళ్లారు. ఎమ్మెల్యే సూచనలతో అధికారులు క్షేత్రస్థాయిలో సర్వే చేసి రైతులకు వన్‌బీలు ఇప్పించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రైతులకు తహసీల్దార్ శ్రీనివాస్ మిశ్రా సోమవారం వన్‌బీలు అందజేశారు. రైతులు ఎమ్మెల్యే అప్పలనరసయ్యకు, తహసీల్దార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఆల్ ఫ్రీ బాబు మాటలు నమ్మవద్దు

- జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



మహిళకు పథకాలను వివరిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు

గుర్ల: అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని చింతలపల్లిపేటలో సోమవారం 'గడపగడపకుమన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ముందుగా గ్రామంలో నిర్వహించిన స భలో జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ పేదలకు పథకాలు అందిస్తే తట్టుకోలేక టీడీపీ నాయకులు నాలుగేళ్లుగా ప్రభుత్వంపై లేనిపోని ఆరోపణలు, దుష్ప్రచారాలు చేస్తూ వచ్చారని గుర్తుచేశారు. ఇప్పుడు అదే టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి మించి సంక్షేమ పథకాలు అందిస్తామని, ఆల్ ఫ్రీ అని చెబుతున్నారని ఎద్దేవా చేశారు. సంక్షేమ పథకాల వల్ల రాష్ట్రం మరో శ్రీలంక అయిపోతుందని ప్రచారం చేసిన నాయకులే.. ఇప్పుడు అదే సంక్షేమ పథకాలకు పేర్లు మార్చి అమ లు చేస్తామని చెబుతున్నారని అన్నారు. చంద్రబాబు చెప్పిన పథకాలు అమలు చేస్తే రాష్ట్రం సింగపూర్ అవుతుందా అని ప్రశ్నించారు. ఆల్ ఫ్రీ చంద్రబాబు మాటలను నమ్మవద్దని ప్రజలకు సూచించారు. అనంతరం వలంటీర్లకు వంద నం కార్యక్రమంలో భాగంగా వలంటీర్లను ఘనంగా సత్కరించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వి.సూర్యనారాయణరాజు, జెడ్పీటీసీ శీర అప్పల నా యుడు, నాయకులు బెల్లాన బంగారునాయుడు, బోళ్ల సుబ్రహ్మణ్యం, తోట తిరుపతిరావు, అంబల్ల చిన్నారావు, సర్పంచ్ జమ్ము శ్రీదేవి, జమ్ము అప్పలనాయుడు, ఎంపీడీఓ కల్యాణి, తహసీల్దార్ సూర్యనారాయణ పాల్గొన్నారు.

నవధాన్యాల విత్తనాల పంపిణీ



నవధాన్యాల కిట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ రఘురాజు,తదితరులు

శృంగవరపుకోట: ప్రభుత్వం రాయితీపై ఇచ్చే నవధాన్యాల విత్తనాలను రైతులు సద్వినియోగంచేసుకోవాలని ఎమ్మెల్సీ రఘురాజు కోరారు. సంతగైరమ్మపేటలో రైతులకు నవధాన్యాల విత్తనాలను సోమవారం ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ సోమేశ్వరరావు, జెడ్పీటీసీ వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీ సుధారాజు, సర్పంచ్ గోగాడ కళావతి వార్డుమెంబర్లు పాల్గొన్నారు.

షిర్డీసాయి ఆలయ వార్షికోత్సవం

కృష్ణాపురంలో షిర్డీసాయిబాబా ఆలయ వార్షికోత్సవం శనివారం నిర్వహించారు. ఎమ్మెల్సీ రఘు రాజు దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నసమారాధనలో భక్తులకు వడ్డన చేశారు.

ఘనంగా తొలేళ్ల ఉత్సవం

జామి: మండలంలోని గొడికొమ్ము గ్రామదేవతలు పైడితల్లమ్మ, బంగారమ్మ తల్లి పండగ నేపథ్యంలో తొలేళ్ల ఉత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మంగళవారం నిర్వహించే రథోత్సవంలో భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా గ్రామ పెద్దలు, పంచాయతీ పాలకులు తగిన ఏర్పాట్లు చేశారు.

నేడు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో వేడుకలు

చీపురుపల్లి: వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా చీపురుపల్లిలోని నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మంగళవారం వేడుకలు నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మండల నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 10 గంటలకు పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేయనున్నామని, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు హాజరవుతారని, పలు సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి నియోజకవర్గంలోని చీపురుపల్లి, గరివిడి, మెరకముడిదాం, గుర్ల మండలాల ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.